www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | శనివారం,అక్టోబర్3,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:208 | పేజీలు: 8 | వెల: రూ.5/-

ఉద్యోగ నియామకాల్లో హైదరాబాద్ దేశంలోనే టాప్!

దేశంలోని ఇతర ప్రధాన మెట్రో నగరాల కంటే 'వైట్ కాలర్' (ఆఫీస్) ఉద్యోగ నియామకాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ జాబ్ పోర్టల్ 'నౌకరి.కామ్' విడుదల చేసిన తాజా 'జాబ్‌స్పీక్' నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఈ సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో నియామకాలు 9 శాతం వృద్ధిని సాధించాయి. ఇదే సమయంలో జాతీయస్థాయిలో నియామకాల వృద్ధి కేవలం 2 శాతంగానే నమోదవడం గమనార్హం.నౌకరి నివేదిక ప్రకారం, హైదరాబాద్ (9%) తర్వాత చెన్నై (6%), బెంగళూరు (4%), కోల్‌కతా (4%) నగరాలు సానుకూల వృద్ధిని కనబరిచాయి. పుణెలో నియామకాలు స్థిరంగా కొనసాగుతుండగా, దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు దేశ రాజధాని ప్రాంతం (ఢిల్లీ-ఎన్‌సీఆర్)లో ఉద్యోగ అవకాశాలు 6 శాతం మేర క్షీణించాయి.రంగాల వారీగా విశ్లేషిస్తే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) విభాగాల్లో అత్యధికంగా 20 శాతం వృద్ధి నమోదైంది.

డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా

అల్పాహార పథకం

- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం

సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి.జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను



లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

కరవుసీమ ఇకపై కనకసీమగా

మారుతుంది

- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య

మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన



అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు.

గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలి

- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమచరిత్రను వక్రీకరించే ందుకు జరుగు తున్న ప్రయ త్నాలను ప్రతిఒక్కరూ ఐక్యంగా తిప్పికొ ట్టాలని ఆయన పిలు పునిచ్చారు.



హైదరాబాద్‌లో ఉద్రిక్తత

- హైదరాబాద్‌లోని సంతోషిమాత ఆలయంలో విగ్రహంపై దాడి
- పూజలు చేస్తుండగా కర్రలతో విగ్రహాన్ని కొట్టిన ఆగంతుకుడు



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భవానీ నగర్ కాలనీలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం పూజలు జరుగుతుండగా ఒక వ్యక్తి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో భక్తులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు.



స్వచ్ఛాంధ్రతోనే

స్వర్ణాంధ్ర

పరిశుభ్రత సామాజిక బాధ్యత

- నెలకు ఒక రోజైనా పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపు
- పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, అది సామాజిక బాధ్యత అని స్పష్టీకరణ

అమరావతి,(రియల్ అడ్వైజర్)

పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ నెలకు ఒక్క రోజైనా తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో జరిగిన "స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర" అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

బంగాళాఖాతంలో

అల్పపీడనం

- అక్టోబర్ 15 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ
- ఈ సీజన్‌లో ఏపీలో 34.9 శాతం మేర వర్షపాతం లోటు



అమరావతి(సామాన్యుడి అస్త్రం)

నైరుతి రుతుపవనాల సీజన్‌లో తీవ్ర వర్షపాత లోటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్ర ప్రదేశ్‌కు వాతావరణానికి సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. దీని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది.సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, అక్టోబర్ 12వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో అక్టోబర్ 13 నాటికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ అల్పపీడనం పశ్చిమ, వాయవ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడనుంది.అక్టోబర్ 15 నాటికి ఇది దక్షిణ, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో వాయుగుండంగా మారవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో దీని గమనం, తీవ్రతపై మరింత స్పష్టత వస్తుందని, వాతావరణ పరిస్థితులను బట్టి మార్పులు ఉండవచ్చని పేర్కొన్నారు.

తెలంగాణలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- తెలంగాణలో 12 ఏళ్ల తర్వాత సవరించిన ఆటో ఛార్జీలు
- కనీస ఛార్జీ రూ. 30, ఆ తర్వాత కిలోమీటరుకు రూ. 14గా నిర్ధారణ
- రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు ఒకటిన్నర రెట్లు అధిక ఛార్జీ

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో సామాన్యులపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో రిక్షా ఛార్జీలను పెంచుతూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత ఈ ఛార్జీలను సవరించడం గమనార్హం. నూతన ఛార్జీల ప్రకారం, కనీస ఛార్జీని (తొలి 1.6 కిలోమీటర్లకు) రూ.30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ ఛార్జీలను కూడా సవరించారు.



నోటీసులు వచ్చినా ఆఫీసులకు రావొద్దు

- ఓటర్లు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేదన్న సీఈవో
- ఇంటి వద్దకే వచ్చి పత్రాలు సేకరించనున్న బీఎల్‌వోలు

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్-2026)లో భాగంగా నోటీసులు అందుకున్నవారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌వో) లేదా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో) కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వివేక్‌యాదవ్ స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) స్వయంగా ఓ టర్ల ఇళ్లకు వచ్చి అవసరమైన పత్రాలను సేకరిస్తారని ఆయన తెలిపారు.



రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందపడుతున్నాయని విమర్శ

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.



డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం

మొదటి పేజీ తరువాయి

- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

ఆ దిశగా ఈ కార్యక్రమం ఒక ముఖ్య మైన మైలురాయిగా నిలవనుంది. ఈ రెండు సంస్థలు కలసి అందించిన రూ.9.17 కోట్లఉమ్మడి విరాళంతో రెండు ప్రాంతాల్లోని ప్రభు త్వ పాఠశాల పిల్లలకు ప్రతిరోజూ పరిశుభ్రమైన, పోషకాలతో కూడిన బ్రేక్ ఫాస్ట్ వండి అందించే అత్యాధునిక, అధిక సామర్థ్యం కలిగిన సెంట్రలైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేయను న్నారు. తెలంగాణలో ఏ చిన్నారి కూడా ఆకలి కారణంగా విద్యకు దూరం కాకూడదనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇది ఎంతగానో తోడ్పడుతుంది.జున్నా



సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్‌రెడ్డి స్వస్థలమైన నాగర్ కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూ నిటీ కిచెన్ ఏర్పాటు కోసం ఆ సంస్థ రూ. 5.17 కోట్ల చెక్కును అందిస్తూ హెచ్‌కేఎమ్ ఛారిటబుల్ ఫౌండేషన్‌కు మద్దతుగా నిలిచింది. ఈ కిచెన్ ద్వారా నాగర్ కర్నూల్ జి ల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 50వేలమంది పిల్లలకు పౌష్టికాహారంతో కూడిన బ్రేక్ ఫాస్ట్ అందుతుంది. ఢిల్లీకి చెందిన చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, వికారాబాద్ లోసెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు కోసంరూ. 4 కోట్ల చెక్కును అందజేసింది.ఈ కిచెన్ ద్వారా వికారాబాద్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన20వేల మంది పిల్లలకుపౌష్టికాహారంతో కూడిన బ్రేక్ ఫాస్ట్ అందించబడుతుంది. శుక్రవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్‌రెడ్డి, బి.అనిల్‌బాబు, సీఈవో అండ్ డైరెక్టర్, జున్నాసోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సుమంతడే – వైస్ ప్రెసిడెంట్, పబ్లిక్వాలసీ కలసి చెక్కులను హెచ్‌కేఎమ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్యగౌర చంద్ర దాస స్వామీజీకి అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పరిశ్రమలను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణా, గోదావరి నదులు కలుషితమయ్యాయని విమర్శ
రాష్ట్రంలో వర్షపాత లోటుకు పారిశుద్ధ్య లోపాలు కూడా ఓ కారణమని వ్యాఖ్య

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన ఆస్తి స్వచ్ఛాంధ్ర కార్యక్రమమేనని అన్నారు. కేవలం రోడ్లు శుభ్రంగా ఉంటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. తమ ప్రభుత్వం చెత్తను ఒక సమస్యగా కాకుండా, సంపదగా చూస్తోందని, చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో పరిశుభ్రతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చంద్రబాబు విమర్శించారు. వారి వైఖరి కారణంగానే కృష్ణా, గోదావరి నదులతో పాటు కాలువల్లోకి మురుగునీరు చేరి తీవ్రంగా కలుషితమయ్యాయని ఆరోపించారు. పర్యావరణంపై పడిన ఈ ప్రభావం వాతావరణ మార్పులకు కూడా దోహదపడిందని, ప్రస్తుతం రాష్ట్రం 53 శాతం వర్షపాత లోటును ఎదుర్కోవడానికి పారిశుద్ధ్య లోపాలు కూడా ఒక కారణమని ఆయన పేర్కొన్నారు.

ప్రతి పౌరుడు స్వచ్ఛాంధ్రలో భాగస్వామి అయినప్పుడే స్వర్ణాంధ్ర లక్ష్యాలు నెరవేరతాయని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిశు భ్రత పాటించిన గ్రామాలు, పట్టణాలు, వివిధ సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం తదితరులు పాల్గొన్నారు.

కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.




తెలంగాణలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు..

మొదటి పేజీ తరువాయి

రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు ఒకటిన్నర రెట్లు అధిక ఛార్జీ
మూడు నెలల్లో మీటర్లు మార్చాలని డ్రైవర్లకు ఆదేశాలు
పెరిగిన ఖర్చుల దృష్ట్యా ప్రభుత్వ కమిటీ సిఫారసులతో నిర్ణయం

ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ ఛార్జీలను కూడా సవరించారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య సాధారణ ఛార్జీపై ఒకటిన్నర రెట్లు అధికంగా వసూలు చేస్తారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే సమయానికి (వెయిటింగ్ ఛార్జీలు) నిమిషానికి 75 పైసలుగా ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొత్త ఛార్జీలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా పాత, కొత్త ఛార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డులను ఆటోల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది.చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ



హయాంలో 2014 ఫిబ్రవరిలో ఆటో ఛార్జీలను సవరించారు. వాహనాల కొనుగోలు వ్యయం, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు, బీమా, డ్రైవర్ల జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ఛార్జీలు పెంపును సిఫారసు చేస్తూ ప్రభుత్వ నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ సిఫారసుల మేరకే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో, టీజీఎస్ఆర్టీసీ బస్సుల కోసం కామన్ పాస్‌ను ప్రారంభించిన రోజే ఈ ఛార్జీల పెంపు ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

మొదటి పేజీ తరువాయి

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు
కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందపడుతున్నాయని విమర్శ
నల్గొండకు 5,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ

శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు.నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి



ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం..



మొదటి పేజీ తరువాయి

కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో (జూన్ 1 – సెప్టెంబర్ 30) రాష్ట్రంలో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సగటున 589.7 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా, కేవలం 383.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 34.9 శాతం వర్షపాత లోటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడనున్న ఈ వాతావరణ వ్యవస్థ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయా లేదా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

హైదరాబాద్‌లో ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

నిందితుడిని అదుపులోకి తీసుకున్న చైతన్యపురి పోలీసులు
ఘటనను ఖండించిన బీజేపీ నేతలు, దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన
నిందితుడికి మానసిక సమస్యలు ఉన్నాయని పోలీసు వర్గాల సమాచారం


వివరాల్లోకి వెళితే, ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. నేరుగా గర్భగుడిలోకి వెళ్లి తన చేతిలోని కర్రలతో విగ్రహంపై దాడి చేయడం ప్రారంభించాడు. ఈ హఠాత్పరిణామంతో భయాందోళనకు గురైన భక్తులు కేకలు వేశారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎల్బీ నగర్ ఏసీపీ రవీంద్ర రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.నిందితుడిని మహమ్మద్ అన్సారీగా పోలీసులు గుర్తించారు. అతను కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. నిందితుడు గర్భగుడిలోకి వెళ్లి విగ్రహంపై దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ రంగారెడ్డి అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వాణిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఆలయాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

నోటీసులు వచ్చినా ఆఫీసులకు రావొద్దు: ఏపీ సీఈవో

మొదటి పేజీ తరువాయి

ఇంటి వద్దకే వచ్చి పత్రాలు సేకరించనున్న బీఎల్‌వోలు
నిరాశ్రయులు, కార్మికుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు
జాబితాలో పేరు లేనివారు తర్వాత కూడా నమోదు చేసుకోవచ్చన్న వివేక్ యాదవ్

గురువారం జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు సీఈవో డిల్లీరావు కూడా పాల్గొన్నారు. ఓటర్ల నుంచి పత్రాలు తీసుకున్న తర్వాత బీఎల్‌వోలే వాటిని ఈసీఐ నెట్‌లో అప్‌లోడ్ చేస్తారని వివేక్ యాదవ్ వివరించారు. అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే ఆన్‌లైన్‌లో విచారణ ఉంటుందని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అలాంటి కేసులు కేవలం 209 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.ఒకవేళ విచారణకు హాజరుకావాల్సి వస్తే, నోటీసులు అందుకున్న ఓటరు తన తరఫున 18 ఏళ్లు నిండిన కుటుంబ సభ్యుడిని పంపవచ్చని సూచించారు. ఆన్‌లైన్ విచారణ సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. నగరాల్లోని నైట్‌షెల్టర్లలో నివసించేవారు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల ఓటు నమోదు కోసం అవసరాన్ని బట్టి ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు, శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో సూచించారు.'సర్' ప్రక్రియ కోసం ఫాం-6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తుచేశారు. అయితే సాధారణ సమయాల్లో మాత్రం 'రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోరల్ రూల్స్-1960' ప్రకారమే ఫాం-6లను వినియోగించాలని స్పష్టం చేశారు. 'సర్' ప్రక్రియలో లేదా తర్వాత జాబితాలో పేర్లు నమోదు చేసుకోలేకపోయిన యువత, మొదటిసారి ఓటు వేసేవారు 'కంటిన్యూయస్ అప్‌డేషన్' ప్రక్రియలో ఈఆర్‌వోకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



గాంధీ చరిత్రను వక్రీకరిస్తూ గాడ్సేను స్మరిస్తున్నారు

దూరంగా ఉండాలి: డిప్యూటీ సీఎం భట్టి
ఎల్బీస్టేడియంలో గాంధీ జయంతి వేడుకలు
బాపూఘాట్‌లో గవర్నర్, సీఎం నివాళులు



హైదరాబాద్, అక్టోబరు 2 (సామాన్యుడి అస్త్రం)

మహాత్మా గాంధీ చరిత్రను వక్రీకరిస్తూ గాడ్సేను స్మరించుకునే దౌర్భాగ్య పరిస్థితులు నేడు దేశంలో దాపురించాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గాంధీజీని విమర్శించే వారు దేశద్రోహులని.. వారికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అసమానతలు, అవమానాలు లేని సమాజాన్ని నిర్మించుకోవడమే జాతిపిత గాంధీజీకి ఇచ్చే నిజమైన నివాళి అని చెప్పారు. శుక్రవారం ఎల్బీస్టేడియంలో టీపీసీసీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూ బాట పేరుతో 1,157 చరకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ.. గాంధీజీ భారత్‌లో పుట్టడం మన అదృష్టంగా భావించాలని, ఆయన ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్లడమే మన లక్ష్యమని చెప్పారు. గాంధీజీ గురించి పూర్తిగా తెలియని వారు ఆయన చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గాంధీయిజమే భారత్‌కు శ్రీరామరక్ష అని వ్యాఖ్యానించారు. గాంధీ జయంతి ప్రపంచానికి ఒక పండుగలాంటిదని, శాంతిని కోరుకునే ప్రపంచ ప్రజలంతా గాంధీజీని చూసి గర్వపడుతున్నారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ..గాంధీజీ జీవిత చరిత్రను ప్రతి విద్యార్థికి తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు మాట్లాడుతూ.. గాంధీజీ బాటలో నడిచి జాతీయ జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి మంత్రి అజారుద్దీన్, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, గాంధీ జ్ఞానప్రతిష్ఠ అధినేత గున్నా రాజేందర్‌రెడ్డి హాజరవ్వగా.. దాదాపు 10 వేల మంది విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రజా రవాణాను ఏకీకృతం చేసే దిశగా కీలక అడుగు వేశాం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 2 (సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లో ఆర్టీసీ, మెట్రో ఉమ్మడి కామన్ ట్రావెల్ పాస్ ఈరోజు (శుక్రవారం) నుంచి అందుబాటులోకి వస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (తెలిపారు. అన్ని మెట్రోస్టేషన్లలో ఈ పాస్ జారీ చేస్తారని వెల్లడించారు. ఈ పాసుతో ూ== పరిధిలోని సిటీ బస్సులు, మెట్రోలో ప్రయాణించవచ్చని చెప్పుకొచ్చారు. ఈ కామన్ పాసుపై సీఎం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.పరిధిలోని సిటీ బస్సుల్లో ఈ పాస్ చెల్లుబాటవుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బస్సు -- మెట్రోకు ఇక రెండో టికెట్ అవసరం లేదని తెలిపారు. 25 లక్షలకు పైగా బస్సు ప్రయాణికులకు ఈ కామన్ పాసుతో ప్రయోజనం ఉంటుందని చెప్పుకొచ్చారు. 4.5 లక్షల మంది మెట్రో ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. మెరుగైన లాస్ట్‌మైల్ కనెక్టివిటీపై తాము ఫోకస్ పెట్టామని అన్నారు. ప్రజా రవాణాను ఏకీకృతం చేసే దిశగా కీలక అడుగు వేశామని తెలిపారు. హైదరాబాద్‌ను 'ఫాస్టెస్ట్ సిటీస్'లో ఒకటిగా మార్చడమే జఖ=ఱు లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.కాగా, ఆర్టీసీ బస్ - మెట్రో రైల్ కలిపి రోజు, నెల వారి పాసులను సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ జారీ చేసింది. ఆర్టీసీ మెట్రో రైల్ జాయింట్ పాసుతో ఆర్టీసీ బస్సు, మెట్రో రైల్లో ప్రయాణించే సదుపాయం కల్పించింది. రోజు వారి పాస్ రూ.400, నెల వారి పాస్ రూ.8500 ఖరారు చేసింది. ఆర్టీసీ బస్సుల్లో ఆన్‌లైన్ టికెటింగ్‌ను ప్రభుత్వం తీసుకువచ్చింది. కండక్టర్‌తో పని లేకుండా మొబైల్లోనే టికెట్ పొందే సదుపాయం కల్పించింది. ఫిజికల్ టికెట్ అవసరం లేకుండా మొబైల్లోనే టికెట్ పొందే సదుపాయం తీసుకువచ్చింది. వారం రోజుల పాసును సైతం ఆర్టీసీ తీసుకువచ్చింది. మీ టికెట్ యాప్ ద్వారా మొబైల్లోనే రోజు వారి టికెట్, డే పాస్, వారం, నెల వారి బస్ పాసులను పొందే సదుపాయాన్ని రాష్ట్ర సర్కార్ కల్పించింది.

మెట్రో వద్ద దొరికిన చోరీ స్కూటర్!

- **మెట్రో స్టేషన్ సమీపంలో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో గుర్తింపు**
- **పార్క్ చేసిన వాహనాల్లో చోరీకి గురైన 'హీరో ప్లెజర్'**
- **మియాపూర్ పోలీసులకు సమాచారం.. వాహనం అప్పగింతకు ఏర్పాట్లు**

సామాన్యుడి అస్త్రం / మియాపూర్ :

మెట్రో స్టేషన్ దగ్గర పార్క్ చేసి ఉన్న స్కూటర్.. చుట్టుపక్కల దానికి సంబంధించిన వారెవరూ కనిపించలేదు. ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేయగా అది చోరీకి గురైన వాహనమని తేలింది. మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఈ విషయం బయటపడింది.మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాహన తనిఖీల్లో భాగంగా, సమీపంలో ఎవరూ లేకుండా పార్క్ చేసి ఉన్న వాహనాలను పోలీసులు పరిశీలించారు. వాటిలో 'హీరో ప్లెజర్' స్కూటర్ చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ వాహనానికి సంబంధించి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే క్రైమ్ నంబర్ 1001/2026, బీఎన్ఎస్ సెక్షన్ 305(ఎ) కింద కేసు నమోదై ఉన్నట్లు తెలిపారు.వాహనాన్ని గుర్తించిన



విషయాన్ని మియాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌కు తెలియజేశారు. తదుపరి చర్యల కోసం స్కూటర్‌ను మియాపూర్ పోలీసులకు అప్పగించనున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

మాదాపూర్‌లో నిషేధిత వేప్‌ల దందా!

- **రెండు దుకాణాలపై ఈగల్ ఫోర్స్, మాదాపూర్ పోలీసుల సంయుక్త దాడులు**
- **92 ఈ-సిగరెట్లు, వేప్‌లు స్వాధీనం.. నలుగురు అదుపులోకి**
- **సరఫరా వ్యవస్థపై దర్యాప్తు.. పరారీలో ఉన్న యజమాని కోసం గాలింపు**

సామాన్యుడి అస్త్రం / మాదాపూర్

: నిషేధిత ఈ-సిగరెట్లు, వేప్‌ల విక్రయాలు మాదాపూర్‌లో బయటపడ్డాయి. రెండు దుకాణాలపై రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఈగల్ ఫోర్స్, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 92 ఈ-సిగరెట్లు, వేప్‌లు పట్టుబడ్డాయి. ఈ వ్యవహారంలో నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 1న మాదాపూర్‌లోని స్కోకిన్ స్పాట్, కావేరి హిల్స్ ఫేజ్--2లోని హోలీ స్మోక్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. నిషేధిత ఉత్పత్తుల అక్రమ విక్రయాలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో 92 ఈ-సిగరెట్లు, వేప్‌లతోపాటు 15 ప్యాకెట్ల విదేశీ సిగరెట్లు, రెండు స్కానర్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ ఉత్పత్తులు దుకాణాలకు ఎక్కడి నుంచి వస్తున్నాయి? సరఫరా వెనుక ఎవరున్నారు? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విక్రయాలకు సంబంధించిన పూర్తి సరఫరా వ్యవస్థను గుర్తించే పనిలో ఉన్నారు. పరారీలో ఉన్న దుకాణ యజమాని, ఇతర అనుమానితుల కోసం గాలిస్తున్నారు.



శీతాకాలంపై ఎల్‌నినో ప్రభావం..

అక్టోబర్‌లో ఎండలే!



ఎల్‌నినో ప్రభావంతో ఈసారి శీతాకాలంలో చలి తక్కువ
అక్టోబర్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
తెలంగాణలో 18 శాతం వర్షపాతం లోటు నమోదు
ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్న ప్రపంచ వాతావరణ సంస్థ
వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఎల్‌నినో ప్రభావం

హైదారాబాద్, (సామాన్యుడి అస్త్రం)

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది శీతాకాలంలో చలి తీవ్రత తక్కువగా ఉండనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) స్పష్టం చేసింది. వర్షాకాలం ముగిసి, అక్టోబర్ 1 నుంచి దేశంలో శీతాకాలం అధికారికంగా ప్రారంభమైందని తెలిపింది. అయితే, అక్టోబర్ నెలలో మాత్రం చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది.దేశవ్యాప్తంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని ఐఎండీ పేర్కొంది. అయితే, వాయవ్య భారతంతో పాటు దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం నుంచి అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

తెలంగాణలో వర్షపాతం లోటు

ఇటీవల ముగిసిన వర్షాకాలంలో తెలంగాణలో 18 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ముఖ్యంగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో అత్యధిక లోటు కనిపించిందని వాతావరణ శాఖ వెల్లడించింది. తాజా అంచనాల నేపథ్యంలో రాష్ట్రంలో రాబోయే రోజుల్లోనూ వర్షాభావ పరిస్థితులు కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి

పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో మరింత బలపడుతోందని, దీని ప్రభావం వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) కూడా హెచ్చరించింది. దీని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తాయని తెలిపింది. ఈ నేపథ్యంలో వ్యవసాయం, నీటిపారుదల, ఆరోగ్యం, ఇంధన రంగాల్లో తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని డబ్ల్యూఎంవో సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సాలో సూచించారు. కాగా, దేశంలో 2026 నైరుతి రుతుపవనాలు 12.6 నుంచి 13 శాతం లోటుతో ముగిశాయి. 2001 తర్వాత ఇంత తక్కువ వర్షపాతం నమోదు కావడం ఇది నాలుగోసారి.

గాంధీ జయంతి వేళ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్

గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా అని కాంగ్రెస్‌ను నిలదీత
గాంధీ ఆశయాలను ప్రధాని మోదీ నెరవేరుస్తున్నారని, నిజమైన వారసులు బీజేపీయేనని వ్యాఖ్య
ఓటమి తర్వాత ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌పై ఘాటు విమర్శలు
ఖైరతాబాద్ ఉపఎన్నికలో హిందూ ఓట్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా

హైదారాబాద్, (సామాన్యుడి అస్త్రం)

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు.మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు.

రూ.52 వేల కోట్లతో హైదరాబాద్ అభివృద్ధి

రూ.38వేల కోట్లతో 'మెట్రో ఫేజ్-2'
భాగ్యనగరి ప్రగతికి కాంగ్రెస్ బాసట
బీఆర్ఎస్ చేసిందేమీ లేదు
కామన్ పాస్‌తో ప్రయాణం సులువు
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ఆవిష్కరణ
మంత్రులు పొన్నం, వివేక్, అజారుద్దీన్ హాజరు



హైదరాబాద్, అక్టోబర్ 2 (సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్ నగర(భవిష్యత్తు అవసరాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణం గా మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క) పేర్కొన్నారు. ప్రస్తు తం రూ.52,000 కోట్లతో హైదరాబాద్ అభివృద్ధి జరుగుతుందని, అందుకు సంబంధించిన పనులు వేగంగా కొనసాగుతున్నా యని వెల్లడించారు. అప్పుడు, ఇప్పుడు హైదరాబాద్ ప్రగతికి బాసటగా నిలిచింది కాంగ్రెస్సేనని, బీఆర్ఎస్ పదేళ్లలో ప్రచా రం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు.శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో టీజీఎస్ ఆర్టీసీ(), హైదరాబాద్ మెట్రో రైల్ సంయుక్తంగా రూపొందించిన 'ఆర్టీసీ- మెట్రో కామన్ పాస్'ను మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, అజారుద్దీన్‌తో కలిసి డిప్యూ టీ సీఎం ఆవిష్కరించారు. అలాగే ఆటో ఛార్జీల సవరణ జీఓను విడుదల చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. కేవలం హెచ్ఎండీఏ పరిధిలోనే రూ.35,000 కోట్ల తో ఫ్లైఓవర్లు, వంతెనలు, రేడియల్ రోడ్ల ని ర్మాణాలు జరుగుతున్నాయని, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ మంచినీటి ప్రాజెక్టులు, అండర్‌పాస్‌ల పనులతో కలిపి మొత్తం రూ.52 వే ల కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రూ.38,000 కోట్ల అం చనా వ్యయంతో 122 కిలోమీటర్ల మేర మె ట్రో ఫేజ్--2 ప్రాజెక్టును విస్తరిస్తున్నట్లు తెలిపారు. రూ.30,627 కోట్లతో 362 కిలో మీటర్ల మేర ట్రిపుల్ఆర్ నిర్మాణం, ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్‌లను అనుసంధానించేలా 21 రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తు న్నామని భట్టి వెల్లడించారు.

కీలక ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలోనే..

కీలక ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హ యాంలో చేపట్టినవేనని డిప్యూటీ సీఎం భట్టి పేర్కొన్నారు. మూసీ శు ద్ధి, ఈ బస్సులు, భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి, మంజీరా జలాలు, ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయం, బెల్, ఈసీఐఎ ల్, డీఆర్డీఓ, బీడీఎల్, హెచ్‌సీయూ, ఐఐఐటీ వంటి కీలక ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయని వివరించారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు: మంత్రి పొన్నం

ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సం క్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్న ట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ప్రయాణికులకు మెరుగైన కనెక్టివిటీ అందించడానికి ఆర్టీసీ, మెట్రో, ఆటో వ్యవస్థలను అనుసంధానిస్తున్నామని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా, డ్రైవర్లకు న్యా యం జరిగేలా ఆటో ఛార్జీలను సవరించినట్లు చెప్పారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతినెలా ఇచ్చే రూ.300 కోట్లకు అదనంగా మరో రూ.50 కోట్లు విడుదల చేయాలని డిప్యూటీ సీఎంను కోరారు.

హైదరాబాద్‌కు కామన్ పాస్.. ఇక జర్నీ ఈజీ!



హైదరాబాద్, ((సామాన్యుడి అస్త్రం)

నగర ప్రజా రవాణాను మరింత సులభతరం చేసేలా ఆర్టీసీ--మెట్రో కామన్ ట్రావెల్ పాస్() అందుబాటులోకి వచ్చింది. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క() ఈ కామన్ పాస్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులందరికీ ఆర్టీసీ, మెట్రో డే పాస్‌లను కొనుగోలు చేశారు. కామన్ పాస్‌తో ఆర్టీసీ బస్సు, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం కల్పించారు.రేపు ఉదయం 11 గంటలకు బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి మంత్రులు మెట్రోలో ప్రయాణించనున్నారు. నగరంలో ప్రజా రవాణాను అనుసంధానించే దిశగా ఈ సదుపాయం కీలక అడుగుగా ప్రభుత్వం పేర్కొంటోంది.ఇదే కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లో భారీ స్థాయిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం నగరంలో సుమారు రూ.52 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మెట్రో ఫేజ్-2 విస్తరణకు రూ.38 వేల కోట్లతో ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు.అలాగే రూ.30,627 కోట్ల అంచనా వ్యయంతో 366 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్ (===) నిర్మాణం చేపట్టనున్నట్లు పొన్నం వివరించారు. కాగా, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 122.9 కిలోమీటర్ల విస్తరణకు రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించినట్లు అధికారిక సమాచారం వెల్లడిస్తోంది.

హైదరాబాద్‌లో డోర్‌డాష్ కొత్త టాలెంట్ హబ్



హైదారాబాద్, (సామాన్యుడి అస్త్రం)

ప్రపంచంలోని ప్రముఖ స్థానిక వాణిజ్య వేదికల్లో డోర్‌డాష్(ఒకటి. హైదరాబాద్‌లో తమ తొలి టాలెంట్ హబ్ ను ఏర్పాటు చేయడం ద్వారా భారత్‌లోకి అడుగుపెడుతోంది. తెలంగాణలోని ప్రతిభ, ఆవిష్కరణల వ్యవస్థపై దీర్ఘకాలిక నిబద్ధతను ఇది చాటుతోంది. తొలుత 500 మంది ఉద్యోగులతో ప్రారంభించి, కాలక్రమంలో ఉద్యోగుల సంఖ్యను 3,000కు పైగా పెంచాలని సంస్థ యోచిస్తోందితెలంగాణ ప్రభుత్వ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ ఉ కమ్యూనికేషన్, పరిశ్రమలు ఉ వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి డి. శ్రీధర్ బాబు) ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. డోర్‌డాష్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రవి ఇనుకొండ, డోర్‌డాష్ వర్క్‌ఫోర్స్ స్ట్రాటజీ అండ్ టాలెంట్ అక్విజిషన్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ జెన్నా కోంకే, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయి కృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఈ కేంద్రం ప్రపంచవ్యాప్తంగా డోర్‌డాష్‌కు చెందిన మూడో అంతర్గత సీఎక్స్ఐ సర్వీస్ సెంటర్ కానుంది. మిగిలిన రెండు టెంపే, అరిజోనా, మెక్సికో సిటీలలో ఉన్నాయి. డోర్‌డాష్ యొక్క అంతర్జాతీయ కార్యకలాపాలకు హైదరాబాద్ కేంద్రం మద్దతు అందించనుంది. డోర్‌డాష్ కార్యకలాపాలు సాగిస్తున్న వివిధ ప్రాంతాల్లో వినియోగదారులు, వ్యాపారులు, డాషర్లు నమ్మకమైన సేవలు పొందేందుకు ఇది తోడ్పడనుంది. ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్‌కు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో 56 మిలియన్లకు పైగా నెలవారీ క్రియాశీల వినియోగదారులకు సేవలందిస్తున్న డోర్‌డాష్ అంతర్జాతీయ వేదికకు హైదరాబాద్ బృందం మద్దతు అందించనుంది.మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ " తమ వేగవంతమైన వృద్ధికి అవసరమైన సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి డోర్‌డాష్ హైదరాబాద్‌ను ఎంచుకోవడం, హైదరాబాద్ ఒక గ్లోబల్ టాలెంట్ హబ్‌గా ఎంతగానో ఎదిగిందనడానికి బలమైన నిదర్శనం. ప్రపంచంలోని ప్రముఖ లోకల్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకటిగా, డోర్‌డాష్ 40కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2025లో ఇది 100 బిలియన్ డాలర్లకు పైగా మార్కెట్‌ప్లేస్ గ్రాస్ ఆర్డర్ వాల్యూను నమోదు చేసింది. దీని హైదరాబాద్ హబ్ 3,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరిస్తుందని, తద్వారా హైపర్‌లోకల్ కామర్స్, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్, టెక్నాలజీ, ఆపరేషన్స్‌లో గ్లోబల్ సామర్థ్యాలను హైదరాబాద్‌కు తీసుకువస్తుందని అంచనాగా చెప్పారు."భారతదేశంలో డోర్‌డాష్ తొలి హబ్‌ను ఏర్పాటు చేయడం మా గ్లోబల్ ఆపరేషన్స్ నెట్‌వర్క్‌ను విస్తరించడంలో ఒక ముఖ్యమైన మైలురాయి" అని డోర్‌డాష్‌లో వర్క్‌ఫోర్స్ స్ట్రాటజీ, టాలెంట్ అక్విజిషన్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ జెన్నా కోంకే అన్నారు. డోర్‌డాష్ తమ హైదరాబాద్ హబ్ కోసం నేరుగా ఉద్యోగులను నియమించుకుంటోంది. ప్రారంభంలో సుమారు 500 మంది ఉద్యోగులను నియమించుకోవాలని యోచిస్తోంది, కాలక్రమేణా ఈ సంఖ్యను 3,000కు పైగా పెంచే అవకాశం ఉంది. ఈ పెట్టుబడి హైదరాబాద్ యొక్క అపారమైన ప్రతిభావనరులు, టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దీర్ఘకాలిక కెరీర్ అవకాశాలను కూడా సృష్టించనుంది.

మహాత్ముడి స్ఫూర్తితో ప్రజాపాలన

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా గాంధీ జయంతి



హైదరాబాద్ , అక్టోబర్ 2(సామాన్యుడి అస్త్రం)

అహింస, సత్యాగ్రహం, సమా నత్వం, సామాజిక న్యాయం వంటి మహాత్మాగాంధీ ఆలోచనలే ప్రపంచానికి మార్గదర్శకం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గాంధీ చూపిన మార్గంలో అసమానతలు, వివక్షత లేని సమాజాన్ని నిర్మించా ల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ జయం తి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, టీపీసీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భట్టి ప్రసంగించారు. గాంధీజీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే) భావజాలాన్ని సమర్థించే ధోరణులు దేశం లో కనిపించడం బాధాకరమని, అటువంటి సంస్కృతిని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలోగాంధీ నాయకత్వం, సత్యాగ్రహం, అహింస సిద్ధాంతాలు అత్యంత కీలకపాత్ర పోషించాయన్నా రు. స్వాతంత్రోద్యమంతో సంబంధం లేనివారు, గాంధీతో కలిసి నడవని వ్యక్తులు.. నేడు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దక్షిణాఫ్రికాలో ఎదు రైన అవమానం గాంధీ జీవితంలో కీలక మలుపుగా మారిందని, ప్రజల కోసం పో రాడాలనే సంకల్పాన్ని మరింత బలపరిచిందన్నారు.భారతదేశానికి తిరిగి వచ్చి రైతులు, పేదలు, అణగారిన వర్గాల సమస్యలపై ఉద్యమాలకు నాయకత్వం వహించారని వివరిం చారు. చంపారన్ సత్యాగ్రహం నుంచి దండి సత్యాగ్రహం వరకు గాంధీజీ సామాన్య ప్రజల సమస్యలను ఉద్యమాలకు కేంద్రంగా మార్చారని పేర్కొన్నారు. గుప్పెడు ఉప్పుతో, చిన్న నూలుపోగుతో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి సవాల్ విసిరి భారతదేశ ప్రజల శక్తిని ప్రపంచానికి చాటారని తెలిపారు. స్వాతం త్ర్యం కోసం పోరాడుతూనే సామాజిక అసమానతలు, అంటరానితనానికి వ్యతిరేకంగా నూ గాంధీజీ ఉద్యమించారని వివరించారు.హిందూముస్లిం ఐక్యతను బలోపేతం చేసి స్వాతంత్ర్యో ద్యమాన్ని విస్తృత ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. గాంధీ, నెహ్రూ తదితర జాతీయ నాయకులు వేసిన పునాదుల వల్లే దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం వంటి రంగాల్లో పురోగతి సాధ్యమైందని భట్టి పేర్కొన్నారు. గాంధీజీ ఆలోచనల స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు.ప్రజలందరికీ సమాన అవకాశాలు, విద్య, సామాజి క గౌరవం కల్పించడమే లక్ష్యమని, అందుకు అనుగుణంగా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటె డ్ రెసిడెన్షియల్ స్కూళ్ల' ఏర్పాటుకు శ్రీకా రం చుట్టినట్టు తె పారు. కులం, మతం, వ ర్గం అనే భేదాలు లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలు కలిసి చదువుకునేలా పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గాంధీ వేషధారణ చిన్నారులు డిప్యూటీ సీఎం కు స్వాగతం పలికారు. వివిధ రకాల స్టాల్స్ భట్టి పరిశీలించారు

గాంధేయవాదంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ : మహేష్‌కుమార్ గౌడ్

గాంధీ మార్గం దేశానికి శ్రీరామరక్ష అని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయవచ్చని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ మా ర్గాన్ని అనుసరించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత పటిష్టంగా, ప్రజాకేంద్రంగా కొనసాగుతుందన్నారు. సత్యం, అహింస, శాంతి, సహనం వంటి గాంధేయ విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గాంధీ జయంతి యావత్ ప్రపంచా నికి పండుగని, శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమైన రోజని పేర్కొన్నారు.కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాక ర్, అజారుద్దీన్, వివేక్ వెంకట్‌స్వామి, ప్రభు త్వ సలహాదారు వి.హనుమంతరావు, ఫయీ మ్ ఖురేషీ, అంజన్‌కుమార్ యాదవ్, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కొత్త శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ గాం ధారి ప్రభాకర్, సెక్రటరీ యానా ల ప్రభాకర్‌రెడ్డి, కల్చరల్ కన్వీనర్ అభినయ శ్రీనివాస్, గోపాల్‌జీ తదితరులు పాల్గొన్నారు.


ఒక మహిళ ఇంటిని ఎలా చక్కదిద్దుతుందో, దేశాన్ని నిర్మల అలా తీర్చిదిద్దుతున్నారు: చంద్రబాబు

మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన

హాజరైన కేంద్ర మంత్రి నిర్మల, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, అనంత్ అంబానీ

రూ.లక్ష కోట్ల భారీ అంచనా వ్యయంతో రూపుదిద్దుకోనున్న ప్రాజెక్టు

నిర్మలా సీతారామన్‌ను ఉక్కు మహిళగా అభివర్ణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి(సామాన్యుడి అస్త్రం)

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక 'ఉక్కు మహిళ' అని, దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలతో ముంచెత్తారు. ఓ మహిళ ఇంటిని ఎంత చక్కగా తీర్చిదిద్దగలదో, అదే విధంగా దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మలా సీతారామన్ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఆమె నాయకత్వ పటిమను గుర్తించే ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థిక శాఖ వంటి కీలక బాధ్యతలు అప్పగించారని చంద్రబాబు పేర్కొన్నారు.అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం జరిగిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (+ఎఒ), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (xూూూ) శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ వంటి నెక్స్ట్‌జెన్ సంస్కరణలు, డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల్లో పారదర్శకత తీసుకురావడం ద్వారా దేశాన్ని బలోపేతం చేస్తున్న ఘనత నిర్మలా సీతారామన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయగలుగుతోందంటే దానికి కేంద్ర ప్రభుత్వ సహకారమే కారణమని స్పష్టం చేశారు.అమరావతి, విశాఖ ఉక్కు, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలుస్తోందని గుర్తుచేశారు. ముఖ్యంగా, మదనపల్లెలో ఏర్పాటు కానున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కోసం నిధుల కేటాయింపులో నిర్మలా సీతారామన్ చూపిన చొరవ, అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేమని చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్

ఇవాళ, మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో కేంద్ర సహకారంతో రూ.40 వేల కోట్లు, ప్రైవేటు పెట్టుబడుల ద్వారా మరో రూ.60 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ భారీ ప్రాజెక్టు రాయలసీమ ప్రాంత అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది

అనంత్ అంబానీని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న చంద్రబాబు



మదనపల్లెలో రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన

నన్ను ఏపీ బిడ్డగా చూడాలంటూ అనంత్ అంబానీ భావోద్వేగ ప్రసంగం

ఎమోషనల్ గా స్పందించిన చంద్రబాబు

కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి నిర్మల, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ భాగస్వామ్యం కావాలని సీఎం ఆకాంక్ష

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

"అనంత్ అంబానీ... మీరు ఆంధ్రప్రదేశ్ ముద్దుబిడ్డ" అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శుక్రవారం జరిగిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అనంత్ అంబానీ ప్రసంగం అనంతరం, ముఖ్యమంత్రి స్వయంగా ఆయన వద్దకు వెళ్లి అభినందించి, ఆప్యాయంగా హత్తుకోవడం సభలో ఉన్నవారిని ఆకట్టుకుంది.అంతకుముందు, సభలో ప్రసంగించిన అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని, రాష్ట్ర అభివృద్ధికి తాను ఏం చేయాలో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఆయన ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన లభించింది. అనంత్ ప్రసంగం ముగియగానే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆయనను అభినందించారు.అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంత్ అంబానీ మాటలపై స్పందించారు. "అనంత్ అంబానీని మన రాష్ట్ర ముద్దుబిడ్డగా భావిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలి" అని వేదికపై నుంచి ప్రకటించారు.మదనపల్లెలో ఏర్పాటు చేయనున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (+ఒఒ), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (xూూూ)కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో రూ.40 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వ సహకారంతో, మరో రూ.60 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయం పెంపు, ఆధునిక సాగు విధానాలు, ఎగుమతుల ప్రోత్సాహానికి బాటలు పడతాయని ప్రభుత్వం వివరించింది.కార్యక్రమం అనంతరం ముఖ్య నేతలు మొక్కలు నాటారు. ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్త వదిలింది: మంత్రి నారాయణ

నెల్లూరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న నారాయణ

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు హామీ

కాలేజీలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛ భారత్ – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి ప్రజలందరి సహకారం అవసరమని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈరోజు నెల్లూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ప్రకటించి, ఆధునిక క్రికెట్ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో



ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి మంత్రి నారాయణ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలేజీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను వెంటనే ప్రారంభించి మూడు దశల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా ఒక రోజు కేటాయిస్తున్నారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. "గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించింది. గత ప్రభుత్వం 135 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్తే, మేం వాటన్నింటినీ క్లియర్ చేస్తున్నాం" అని ఆరోపించారు. వైజాగ్, గుంటూరులో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని తెలిపారు. పట్టాల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, తమ ప్రభుత్వం పేదలకు శాశ్వత నివాస పత్రాలు అందిస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన అన్నారు.

ప్రభుత్వానికి ఏపీ ఎన్జీవోల కృతజ్ఞతలు.. 25 రోజుల్లోనే హామీల అమలుపై హర్షం



ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి ఏపీ ఎన్జీవోల ధన్యవాదాలు

12వ పీఆర్సీ చైర్మన్‌గా మాజీ సీఎస్ దినేశ్ కుమార్ నియామకంపై హర్షం

జీతాలతో పాటు రెండు డీఏల చెల్లింపు, ఆరోగ్య కార్డుల సమస్యకు పరిష్కారం

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఏపీ ఎన్జీవో సంఘం హర్షం వ్యక్తం చేసింది. కేవలం 25 రోజుల్లోనే కీలక హామీలను నెరవేరుస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలతో కలిపి రెండు డీఏలను ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌గా మాజీ సీఎస్ దినేశ్ కుమార్‌ను నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయడం, పెన్షనర్లకు డిసెంబర్ 1 నుంచి అదనపు క్వాంటమ్ పెన్షన్ వర్తింపజేయడం సంతోషకరమని అన్నారుఆరోగ్య కార్డుల సమస్య పరిష్కారానికి నెలకు రూ.36 కోట్ల నుంచి రూ.40 కోట్లు నేరుగా ట్రస్ట్‌కు జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విద్యాసాగర్ వివరించారు. ఆరోగ్య కార్డు నిధులు నేరుగా ట్రస్ట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవడం గత పదేళ్లలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు మెరుగైన, నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

నిర్మలా సీతారామన్ ప్రసంగానికి అంతరాయం.. చంద్రబాబు సీరియస్..



మదనపల్లెలో "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్" శంకుస్థాపన

నిర్మలా సీతారామన్ ప్రసంగానికి అడ్డుతగిలిన యువత

ఈలలు, నినాదాలతో గందరగోళం సృష్టించిన కొందరు యువకులు

క్రమశిక్షణ తప్పారంటూ యువతపై వేదిక నుంచే చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

అంతరాయం మధ్యే సంయమనంతో తెలుగులో ప్రసంగించిన నిర్మలా సీతారామన్

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

ప్రభుత్వ కార్యక్రమాల్లో క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని, సభా మర్యాదను ప్రతి ఒక్కరూ పాటించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మదనపల్లెలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగానికి కొందరు యువకులు అంతరాయం కలిగించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తీరుపై వేదిక నుంచే మండిపడ్డారు.వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్" శంకుస్థాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలుగులో ప్రసంగిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సభకు హాజరైన వారిలో కొందరు యువకులు ఈలలు వేస్తూ, కేకలు పెడుతూ నినాదాలతో గందరగోళం సృష్టించారు. ఆమె ప్రసంగానికి పదేపదే అడ్డుతగలడంతో వేదికపై ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకున్నారు.వెంటనే తన చైర్ నుంచి లేచి వెళ్లి మైక్ అందుకున్న చంద్రబాబు, యువకుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "కేంద్ర మంత్రి ప్రసంగిస్తున్నప్పుడు ఇలా క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించడం సరికాదు. ఇది మంచి పద్ధతి కాదు. సభకు ఒక గౌరవం ఉంటుంది, దానిని కాపాడాలి" అంటూ గట్టిగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆగ్రహంతో ఒక్కసారిగా సభలో నిశ్శబ్దం అలుముకుంది.అయితే, ఈ గందరగోళం మధ్య కూడా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సంయమనం కోల్పోలేదు. ఆమె తన ప్రసంగాన్ని తెలుగులోనే కొనసాగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధతను ప్రత్యేకంగా అభినందించారు.

రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్



రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తిరుమలలో మాడవీధుల రూపకర్త ఎవరో తెలుసా.. బ్రహ్మోత్సవాలను కొండపైకి తెచ్చిన మహనీయుడు!

తిరుమల మాడ వీధుల రూపశిల్పి రామానుజాచార్యులు
తిరుమల మాడ వీధులను నిర్మించి బ్రహ్మోత్సవాలకు బాటలు
ఆలయ కైంకర్యాల పర్యవేక్షణకు జీయర్ వ్యవస్థ ఏర్పాటు
సీతా, యోగ నరసింహ, భూదేవి అర్చామూర్తుల ప్రతిష్ఠ
వెయ్యేళ్ల క్రితం ఆయన ప్రవేశపెట్టిన సంప్రదాయాలే నేటికీ కొనసాగింపు
శ్రీవారికి అన్నప్రసాద నైవేద్య విధానానికి శ్రీకారం

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కీర్తి కిరీటంలో ఎన్నో కలికితురాయిలు ఉన్నాయి. వాటిలో కొన్ని వెయ్యి సంవత్సరాలుగా చెక్కుచెదరని వైభవంతో ప్రకాశిస్తున్నాయి. ఆ వైభవానికి, ఆ శాశ్వత కీర్తికి పటిష్ఠమైన పునాదులు వేసిన మహనీయులలో అగ్రగణ్యులు భగవద్ శ్రీ రామానుజాచార్యులు. టీటీడీ కథనం ప్రకారం.. సుమారు వెయ్యేళ్ల క్రితం ఆయన దూరదృష్టితో రూపొందించిన కైంకర్య వ్యవస్థ, ఆగమ సంప్రదాయాలు, ఉత్సవ విధానాలు నేటికీ తిరుమల ఆలయ నిర్వహణకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

మాడ వీధుల నిర్మాణంతో బ్రహ్మోత్సవాలకు కొత్త శోభ

ఒకప్పుడు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు తిరుమల కొండ కింద తిరుచానూరులో ఎనిమిది రోజుల పాటు జరిగేవని చారిత్రక కథనాలు చెబుతున్నాయి. ఈ ఉత్సవాలను కలియుగ వైకుంఠమైన తిరుమల కొండపైనే, స్వామివారి సన్నిధిలోనే అత్యంత వైభవంగా జరపాలనే సంకల్పం రామానుజాచార్యులది. అందుకోసం ఆయన ఆలయం చుట్టూ విశాలమైన నాలుగు మాడ వీధులను ఏర్పాటు చేశారు. ఈ వీధుల నిర్మాణంతోనే తిరుమల బ్రహ్మోత్సవాలు కొండపైకి చేరాయి. శ్రీవారి ఉత్సవమూర్తి వివిధ వాహనాలపై ఈ మాడ వీధుల్లో ఊరేగుతూ లక్షలాది మంది భక్తులకు దర్శనమిచ్చే అద్భుత ఘట్టానికి అప్పుడే బీజం పడింది. నేడు తిరుమల బ్రహ్మోత్సవాల శోభకు, భక్తుల ఆనందానికి ఈ మాడ వీధులే ప్రధాన వేదికగా నిలుస్తున్నాయి. ఇటీవల టీటీడీ ఈ వీధులకు ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేద మార్గాలుగా నామకరణం చేసి రామానుజుల స్ఫూర్తిని కొనసాగించింది.

కైంకర్యాల పర్యవేక్షణకు జీయర్ వ్యవస్థ

ఆలయంలో వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం పూజలు, కైంకర్యాలు నిరంతరాయంగా, నిర్దిష్టంగా జరగడానికి రామానుజాచార్యులు ఒక పటిష్ఠమైన వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అదే జీయర్ వ్యవస్థ. ఆలయ ఆచార వ్యవహారాలను పర్యవేక్షించేందుకు వెంకటనాథ శఠగోప యతి లేదా జీయర్ మఠాన్ని తిరుమలలో ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ద్వారానే ఆలయంలో ఆళ్వార్ల దివ్యప్రబంధంలోని 250కి పైగా పాశురాల పారాయణాన్ని ప్రవేశపెట్టారు.

సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి.. రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి': అనంత్ అంబానీ

ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌తో రైతులను సీఈఓలుగా మారుస్తామన్న అనంత్
ఏపీలో రూ.1 లక్ష కోట్లతో సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్న రిలయన్స్
ఏఐ, డ్రోన్ల టెక్నాలజీతో రైతులకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని వెల్లడి
అనంత్ ప్రసంగానికి మంత్రముగ్ధులైన నేతలు
ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న సీఎం చంద్రబాబు

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు.ఈ సందర్భంగా అనంత్ అంబానీ



మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన ప్రసంగంలో చారిత్రక, జాతీయ అంశాలను ప్రస్తావిస్తూ.. జాతీయ గీతాన్ని రవీంద్రనాథ్ టాగూర్ మదనపల్లెలోనే అంగ్లంలోకి అనువదించారని గుర్తుచేశారు. గాంధీజీ సర్వోదయ, అంత్యోదయ నినాదాలను, లాల్ బహదూర్ శాస్త్రి 'జై కిసాన్', వాజ్‌పేయి 'జై విజ్ఞాన్', ప్రధాని మోదీ 'జై అనుసంధాన్' నినాదాలను ఉటంకిస్తూ.. ఈ నాలుగు నినాదాల కలయికతోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ పనిచేస్తుందని వివరించారు.టెక్నాలజీ సాయంతో రైతుల ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అనంత్ ప్రకటించారు. "ఏఐ, డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో ప్రెసిషన్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తాం. మదనపల్లె టమాటో రైతులు తమ ఉత్పత్తులను ఎప్పుడు, ఎక్కడ అమ్ముకోవాలో చెప్పే వ్యవస్థను రూపొందిస్తాం. రిలయన్స్ గ్రీన్ బిజినెస్ ద్వారా అన్నదాతలను 'ఊర్జాదాతలు' (శక్తి ప్రదాతలు)గా మారుస్తాం" అని తెలిపారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

కరవు సీమ నుంచి ఫలాల సీమగా..



'యువగళం' పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
రాయలసీమలో రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
మదనపల్లె వేదికగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించిన సర్కార్
'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో ఉద్యాన రైతులకు పూర్తిస్థాయి చేయూత
ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యం

అమరావతి.(సామాన్యుడి అస్త్రం)

'యువగళం' పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ రాయలసీమ రైతాంగానికి ఇచ్చిన కీలక హామీ కార్యరూపం దాల్చింది. రూ.1 లక్ష కోట్ల భారీ ప్రణాళికతో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా మార్చే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (జీహెచ్‌హెచ్)కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కాక, ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రూ. లక్ష కోట్లతో సమగ్ర ప్రణాళిక

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి అదనంగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించారు. 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంటను ఎగుమతి చేసే వరకు ప్రతి దశలోనూ ఉద్యాన రైతులకు అండగా నిలవడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలతో సమీక్షలు జరపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేలా ఒప్పించారు.

పాదయాత్రలో చూసి.. మిషన్ రాయలసీమగా మార్చి..

గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చరిత్రాత్మక పాదయాత్ర చేపట్టారు. రాయలసీమలో 124 రోజుల పాటు 1,587 కిలోమీటర్లు నడిచి, 44 నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆ సమయంలో లక్షలాది మంది రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారి ఇబ్బందులు చూసి చలించిపోయిన లోకేశ్.. 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ, ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి హామీలను ఆనాడు ఇచ్చారు.

కరవు సీమ నుంచి ఫలాల సీమగా..

ఒకప్పుడు కరవుకు చిరునామాగా ఉన్న రాయలసీమ, ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన ప్రాంతంగా మారనుంది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, బొప్పాయి, స్వీట్ ఆరెంజ్ వంటి సంప్రదాయ పంటలతో పాటు ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్ బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన కొత్త రకం పంటల సాగుకు ప్రోత్సాహం లభించనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు.. ఎమ్మెల్సీ అనంతబాబుకు మరో ఎదురుదెబ్బ

బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన రాజమండ్రి ప్రత్యేక కోర్టు
సాక్షులను బెదిరించారన్న ఆరోపణలతో గతంలోనే బెయిల్ రద్దు
ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న అనంతబాబు

అమరావతి.(సామాన్యుడి అస్త్రం)

దళిత యువకుడు, తన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను రాజమండ్రిలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో ఆయన విచారణ పూర్తయ్యే వరకు జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.గతంలో సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై బయట ఉన్న అనంతబాబు, కేసులోని కీలక సాక్షులను బెదిరించి, ప్రలోభ పెట్టారన్న ఆరోపణలపై మళ్లీ అరెస్ట్ అయ్యారు. బెయిల్ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించారని నిర్ధారించిన ప్రత్యేక కోర్టు ఆయన బెయిల్‌ను రద్దు చేసింది. అప్పటి నుంచి ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన మరోసారి బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం దానిని తిరస్కరించింది.తాజాగా జరిగిన విచారణలో, ఈ కేసులో కీలకమైన సీసీటీవీ ఫుటేజ్ వంటి ఎలక్ట్రానిక్ ఆధారాలను విచారణకు స్వీకరించేందుకు ప్రాసిక్యూషన్‌కు కోర్టు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం కోర్టు ఆదేశాలతో అనంతబాబు విచారణ పూర్తయ్యేంత వరకు జైల్లోనే ఉండనున్నారు.

మలబద్ధకం సమస్యకు ఇదే బెస్ట్!

మలబద్ధకం నివారణకు బొప్పాయి ఉత్తమమైన పండు
చిలగడదుంప, ఖప్లీ గోధుమ పిండితో మంచి ఫలితం
జీర్ణక్రియను సులభం చేసే అవిసె గింజలు, బాదం
ఫైబర్ ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు నీరు తాగడం ముఖ్యం
ఇవి పోషకాహార నిపుణురాలు సోనియా నారంగ్ సూచనలు



ప్రస్తుత జీవనశైలిలో చాలా మంది ఎదుర్కొంటున్న సాధారణ సమస్య మలబద్ధకం. దీని నుంచి బయటపడటానికి సహజమైన మార్గాల కోసం చూసేవారికి ప్రముఖ పోషకాహార నిపుణురాలు సోనియా నారంగ్ కొన్ని కీలకమైన సూచనలు చేశారు. మలబద్ధకాన్ని ఎదుర్కోవడానికి ఉత్తమమైన పండు 'బొప్పాయి' అని ఆమె స్పష్టం చేశారు. బొప్పాయిలో ఉండే 'పపైన్' అనే ఎంజైమ్, ప్రోటీన్లను సులభంగా విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుందని వివరించారు. ఈ మేరకు హిందూస్థాన్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది.బొప్పాయితో పాటు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచే మరికొన్ని ఆహార పదార్థాలను కూడా ఆమె సిఫార్సు చేశారు. వాటిలో కొన్ని:

కూరగాయ:

చిలగడదుంప. ఇందులో ఉండే అధిక ఫైబర్, నీటి శాతం మలాన్ని తేలికగా ముందుకు కదిలేలా చేస్తుంది.
పిండి: ఖప్లీ (ఎమ్మర్) గోధుమ పిండి. పొట్టుతో ఉండటం వల్ల ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది.

గింజలు:

అవిసె గింజలు. ఇవి పేగుల్లో కదలికలను సులభతరం చేస్తాయి.

నట్స్:

బాదం పప్పులు. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం జీర్ణాశయ కండరాలకు విశ్రాంతినిస్తాయి.అయితే, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకున్నప్పుడు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యమని సోనియా నారంగ్ నొక్కిచెప్పారు. నీరు సరిగ్గా తీసుకోకపోతే మలబద్ధకం సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సూచనలు కేవలం సాధారణ అవగాహన కోసం మాత్రమేనని, దీర్ఘకాలంగా ఈ సమస్యతో బాధపడేవారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని ఆమె స్పష్టం చేశారు.

వర్షాకాలంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు ఇవే!

వర్షాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలపై నిపుణుల సూచనలు
విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, నిమ్మ వంటి పండ్లను తినాలని సలహా
వెల్లుల్లి, అల్లం, ఆకుకూరలు ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడతాయని వెల్లడి
తేమ వాతావరణంలో వచ్చే వ్యాధుల నుంచి ఈ ఆహారాలు రక్షణ కల్పిస్తాయని నివేదిక
వేడిగా వండిన ఆహారం తినడం, పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని సూచన



వర్షాకాలం ప్రారంభంతో వాతావరణంలో తేమ శాతం పెరిగి, ఇన్ఫెక్షన్లు ప్రబలే ప్రమాదం అధికమవుతుంది. ఈ సీజనల్ వ్యాధుల బారి నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించే కొన్ని ప్రత్యేక ఆహారాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా శరీరం సహజ రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవచ్చని వారు పేర్కొంటున్నారు.వర్షాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడే పలు ముఖ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో విటమిన్-సి పుష్కలంగా ఉండే నారింజ, నిమ్మ, ద్రాక్ష వంటి సిట్రస్ జాతి పండ్లు అగ్రస్థానంలో నిలుస్తాయి. ఇవి శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, ఇన్ఫెక్షన్లపై పోరాడే శక్తిని అందిస్తాయి. ప్రతిరోజూ ఒక గ్లాసు గోరువెచ్చని నిమ్మరసం సేవించడం ఆరోగ్యానికి ఎంతో మేలని నిపుణులు సలహా ఇస్తున్నారు.వీటితో పాటు వెల్లుల్లి, అల్లం, ఆకుకూరలు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వెల్లుల్లిలోని 'అల్లిసిన్' అనే సమ్మేళనం అద్భుతమైన యాంటీ-బ్యాక్టీరియల్, యాంటీ-వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. పాలకూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. అలాగే నట్స్, విత్తనాలు, తేనె వంటివి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తూ జలుబు, దగ్గు వంటి సమస్యలను నివారిస్తాయి.వర్షాకాలంలో సాధ్యమైనంత వరకు బయటి ఆహారానికి, పచ్చి కూరగాయలకు దూరంగా ఉండి, ఇంట్లో తాజాగా వండిన వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహార నియమాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండవచ్చని స్పష్టం చేస్తున్నారు. అయితే, ఈ సూచనలు కేవలం ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం మాత్రమేనని, ఏదైనా తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టొచ్చా? సైన్స్ ఏం చెబుతోందంటే..!



ఉదయం బ్రేక్‌ఫాస్ట్ నుంచి రాత్రి భోజనం వరకు గుడ్లు చాలా మంది ఆహారంలో భాగమయ్యాయి. అయితే ఒక సందేహం మాత్రం ఎప్పుడూ ఉంటుంది.. గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టాలా? లేక బయట ఉంచినా సరిపోతుందా? కొందరు ఎప్పుడూ ఫ్రిజ్‌లోనే నిల్వ చేస్తే.. మరికొందరు గది ఉష్ణోగ్రతలో ఉంచుతారు. మరి ఇందులో సరైన పద్ధతి ఏది? శాస్త్రవేత్తలు ఏమంటున్నారు?2021లో 'ఫ్రాంటియర్స్ ఇన్ మైక్రోబయాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. గుడ్లను 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో కొన్ని రోజులు ఉంచితే సాల్మొనెల్లా టైఫిమ్యూరియం అనే బ్యాక్టీరియా వేగంగా పెరిగే అవకాశం ఉంది. అదే ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే ఆ బ్యాక్టీరియా పెరుగుదల గణనీయంగా తగ్గుతుంది. అంటే గుడ్ల భద్రత, తాజాగా ఉండటంలో ఉష్ణోగ్రత కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

కొన్ని దేశాల్లో తప్పనిసరి?

అమెరికా వంటి దేశాల్లో మార్కెట్‌లోకి వచ్చే ముందు గుడ్లను ప్రత్యేకంగా కడిగి శుభ్రం చేస్తారు. దీంతో వాటి పెంకుపై ఉండే సహజ రక్షణ పొర (క్యూటికల్) తొలగిపోతుంది. అది లేకపోవడంతో బ్యాక్టీరియా లోపలికి ప్రవేశించే ప్రమాదం పెరుగుతుంది. అందుకే అక్కడ గుడ్లను 4 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలోనే నిల్వ చేయాలని అమెరికా వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

యూరప్, ఆసియా దేశాల్లో పరిస్థితి భిన్నం

యూరప్, ఆసియాలోని చాలా దేశాల్లో గుడ్లను కడగకుండా విక్రయిస్తారు. దీంతో వాటి సహజ రక్షణ పొర అలాగే ఉంటుంది. అందువల్ల సాధారణంగా ఫ్రిజ్‌లో పెట్టాల్సిన అవసరం ఉండదు. అయితే చల్లని, పొడి ప్రదేశంలోనే నిల్వ చేయాలి. భారత్ వంటి వేడి, తేమ ఎక్కువగా ఉండే దేశాల్లో మాత్రం ఫ్రిజ్‌లో ఉంచితే గుడ్లు ఎక్కువకాలం తాజాగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించేది ఫ్రిజ్

ఎక్కువ ఉష్ణోగ్రతలో సాల్మొనెల్లా ఎంటెరిటిడిస్ వంటి బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల ఈ పెరుగుదల మందగిస్తుంది. అయితే తరచూ ఫ్రిజ్‌లో పెట్టడం, బయటకు తీయడం మంచిది కాదు. ఇలా చేస్తే గుడ్లపై తేమ ఏర్పడి బ్యాక్టీరియా పెరిగే అవకాశాలు పెరుగుతాయి. అందుకే ఒకే ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం అత్యంత ముఖ్యం.

ఇంట్లో గుడ్లను ఎలా నిల్వ చేయాలి?

సూపర్‌మార్కెట్‌లో ఫ్రిజ్‌లో ఉంచిన గుడ్లను కొనుగోలు చేస్తే ఇంటికొచ్చిన తర్వాత కూడా ఫ్రిజ్‌లోనే పెట్టాలి. వాటిని ఫ్రిజ్ డోర్‌లో కాకుండా లోపలి షెల్ఫ్‌లో అసలు కార్టన్‌తోనే ఉంచడం మంచిది. ఎందుకంటే డోర్ తరచూ తెరవడం వల్ల అక్కడ ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది.స్థానికంగా లభించే కడగని గుడ్లను చల్లని వాతావరణంలో వారం రోజుల వరకు బయట ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు నిల్వ చేయాలంటే ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది.

ఫ్రిజ్‌లో పెడితే రుచి మారుతుందా?

గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచితే వాటి రుచి లేదా పోషక విలువలు మారిపోతాయనే అభిప్రాయం చాలామందిలో ఉంది. కానీ దీనికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల గుడ్లు ఎక్కువకాలం తాజాగా ఉండటమే తప్ప వాటి రుచి లేదా పోషకాలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు.

కిడ్నీలో రాళ్ల సమస్య?.. ఈ పండ్లు మీ డైట్‌లో చేర్చుకోండి!



కిడ్నీలో రాళ్ల సమస్యను ఆహార నియమాలతో తగ్గించుకోవచ్చని నిపుణుల సూచన
నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు రాళ్లు ఏర్పడకుండా నివారిస్తాయని వెల్లడి
పుచ్చకాయ వంటివి శరీరానికి నీటిని అందించి రాళ్లను కరిగిస్తాయంటున్న నిపుణులు
యాపిల్, బేరి, బొప్పాయి వంటి పండ్లు కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయని సూచన
ఈ పండ్లు కేవలం నివారణకేనని, వైద్యుడి సలహా తప్పనిసరి అని హెచ్చరిక

ప్రపంచవ్యాప్తంగా కిడ్నీలో రాళ్ల (కిడ్నీ స్టోన్స్) సమస్య పెరుగుతున్న నేపథ్యంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ఆరోగ్య నిపుణులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని వారు సూచిస్తున్నారు. సరైన మోతాదులో నీరు తాగడంతో పాటు కొన్ని పండ్ల వినియోగం రాళ్లు మళ్లీ మళ్లీ ఏర్పడే ప్రమాదాన్ని నివారిస్తుందని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

కిడ్నీలో రాళ్లు ఎందుకు ఏర్పడతాయి?

సాధారణంగా కిడ్నీలో రాళ్లు కాల్షియం ఆక్సలేట్ లేదా యూరిక్ యాసిడ్ వంటి ఖనిజ లవణాలు పేరుకుపోవడం వల్ల ఏర్పడతాయి. ఇవి మూత్రపిండాల్లో లేదా మూత్ర నాళాల్లో ఏర్పడి తీవ్రమైన నొప్పిని, ఇతర ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ సమస్యకు జన్యుపరమైన కారణాలు ఉన్నప్పటికీ, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, తగినంత నీరు తాగకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అయితే, కొన్ని ప్రత్యేకమైన పండ్లను రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

సిట్రస్ పండ్ల ప్రయోజనాలు

నిమ్మ, నారింజ, బత్తాయి వంటి సిట్రస్ జాతి పండ్లు కిడ్నీలో రాళ్ల నివారణకు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిలో 'సిట్రేట్' అనే రసాయనం అధికంగా ఉంటుంది. ఇది మూత్రంలోని కాల్షియంతో కలిసిపోయి, అది స్ఫటికాలుగా మారి రాళ్లుగా ఏర్పడకుండా అడ్డుకుంటుంది. అలాగే, మూత్రం జూన స్థాయిలని పెంచి రాళ్లు ఏర్పడటానికి ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. ముఖ్యంగా రోజూ నీటిలో నిమ్మరసం కలుపుకుని తాగడం చాలా సులభమైన, ప్రభావవంతమైన మార్గమని వైద్యులు సూచిస్తున్నారు. నారింజ పండ్లలో కూడా సిట్రేట్‌తో పాటు విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అయితే, వీటిలో సహజ చక్కెరలు ఉంటాయి కాబట్టి మితంగా తీసుకోవడం మంచిది.

శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచే పండ్లు

పుచ్చకాయ, కర్బూజ వంటి పండ్లలో నీటిశాతం చాలా ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల శరీరానికి కావాల్సిన ద్రవాలు అంది, మూత్రం ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా మూత్రపిండాల్లోని ఖనిజ లవణాలు పలుచబడి, సులభంగా బయటకు వెళ్లిపోతాయి. ఇది రాళ్లు ఏర్పడే ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది. ఈ పండ్లలో సోడియం శాతం కూడా తక్కువగా ఉండటం వల్ల కిడ్నీల మొత్తం పనితీరుకు మేలు జరుగుతుంది.

ఇతర మేలు చేసే పండ్లు

యాపిల్, బేరి వంటి పండ్లలో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిలో 'ఆక్సలేట్' స్థాయిలు చాలా తక్కువగా ఉంటాయి. కాల్షియం ఆక్సలేట్ రాళ్లతో బాధపడేవారికి ఈ పండ్లు సురక్షితమైనవి. బొప్పాయి కూడా అధిక నీటిశాతంతో పాటు ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. ఇది కూడా కిడ్నీలకు స్నేహపూర్వకమైన ఆహారంగా పరిగణించబడుతుంది.అయితే, ఆహారంలో మార్పులు చేసుకునే ముందు ముఖ్యంగా కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి వారి సలహా పాటించడం అత్యవసరం. ఈ పండ్లు కేవలం నివారణకు, ప్రమాదాన్ని తగ్గించడానికి మాత్రమేనని, ఇప్పటికే ఉన్న సమస్యకు వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్న మాట.

రాగి రోజూ తినడం మంచిదేనా? నిపుణులు చెబుతున్న నిజం ఇదే!

రాగి పోషకాలతో నిండిన ఆరోగ్యకరమైన చిరుధాన్యాల్లో ఒకటి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫైబర్, మెగ్నీషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఎముకలు దృఢంగా ఉండేందుకు, రక్తహీనత తగ్గించేందుకు, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలనుకునేవారూ రాగిని ఎక్కువగా ఆహారంలో చేర్చుకుంటున్నారు.అయితే రోజూ రాగినే ప్రధాన ఆహారంగా తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. గోధుమలు, బియ్యం, ఇతర చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం అవసరమని చెబుతున్నారు. రాగిలో కూడా కార్బోహైడ్రేట్లు ఉండటంతో పరిమిత మోతాదులోనే తీసుకోవాలని సూచిస్తున్నారు.




సూపర్‌వుమన్‌గా నటించాలనేది నా కోరిక..

నేషనల్ అవార్డ్ విన్నర్ కృతిసనన్ తన నటనలోని కొత్త కోణాలను ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. 'మిమి' చిత్రంతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఈ భామ, రాబోయే రోజుల్లో పూర్తిగా భిన్నమైన జానర్లలో నటించాలని కోరుకుంటున్నారు. ప్రస్తుతం ఒక వైపు రొమాంటిక్, డ్రామా చిత్రాలతో పాటు మరోవైపు డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలపై ఆమె దృష్టి పెట్టారు. పుష్కర కాలం క్రితం టాలీవుడ్ లో 'నేనొక్కడినే' చిత్రంలో సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నాగచైతన్య సరసన 'దోచెయ్' చిత్రంలోనూ, రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన తెలుగు, హిందీ బైలింగ్వల్ చిత్రం 'ఆదిపురుష్'లోనూ ఆమె సందడి చేశారు. ఆ చిత్రాలేవీ ఆమెకు అనుకున్నంత గుర్తింపును ఇవ్వలేకపోయాయి. దాంతో బాలీవుడ్ చిత్రాలు చేస్తూ అక్కడ బిజీగా ఉంటున్నారు. ఇదిలావుండగా, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను చేయబోయే తదుపరి ప్రాజెక్ట్‌ల గురించి పలు ఆసక్తికరమైన విషయాలను కృతి పంచుకున్నారు. ముఖ్యంగా, భారతదేశంలో ఇప్పటివరకు పురుష సూపర్ హీరోలే ఎక్కువగా ఉన్నారని, ఆ లోటును భర్తీ చేస్తూ ఒక 'సూపర్‌వుమన్' పాత్రలో నటించాలని ఉందని మనసులోని కోరికను బయటపెట్టారు. కేవలం సూపర్‌హీరో పాత్రలే కాకుండా, నటిగా తనలోని నైపుణ్యాన్ని మరింత సవాలు చేసే మోరల్లీ కాంప్లెక్స్, 'గ్రే షేడ్స్' ఉన్న పాత్రలలో నటించడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. సినిమాల్లో నటనతో పాటు పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించాలనే కోరికను కూడా ఆమె బహిరంగంగా వ్యక్తం చేశారు.



వందకు రెండొందల శాతం!

'వారణాసి' సినిమాలో మహేష్‌బాబు నటనపై చిత్ర దర్శకుడు రాజమౌళి ప్రశంసలు కురిపించారు. సినిమా ఆరంభానికి ముందు మహేష్‌బాబు నుంచి ఉత్తమ నటన రాబట్టుకోవాలనే ఆలోచన ఉండేదని, అయితే సెట్‌లోకి ఎంటరయ్యాక అత్యుత్తమ ప్రదర్శనతో తనను ఆశ్చర్యపరిచారని రాజమౌళి కొనియాడారు. 'రుద్ర' పాత్రలో మహేష్‌బాబు చూపిస్తున్న అంకితభావం అంచనాలను మించిపోయిందని, తాను 100శాతం ఆశిస్తే మహేష్‌బాబు ఏకంగా 200శాతం ఇచ్చాడని రాజమౌళి కితాబిచ్చారు.



నా సినిమాలు చూసి నేనే


గర్వపడాలి



'సాఫ్ట్‌వేర్ జాబ్ చేసి, నటనపై ఆసక్తితో ఈ రంగంలోకి వచ్చాను. ఇష్టంతో ఓ రంగాన్ని ఎంచుకున్నప్పుడు కష్టమైనా భరించాలి. సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి' అన్నారు కన్నడ కస్తూరి శ్రీనిధి శెట్టి. ఈ అందాలభామ వెంకటేశ్‌కి జోడీగా నటించిన 'ఆదర్శకుంటుంబం' సినిమా ఈ నెల 9న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను శ్రీనిధి వెల్లడించారు. "ఆదర్శకుటుంబం'లో నేను పోషించిన తల్లి పాత్ర నా కెరీర్‌పై చెడు ప్రభావం చూపిస్తుందని చాలామంది అనుకుంటున్నారు.నేనైతే అలా అనుకోను. 'ఆదర్శకుటుంబం' చూశాక ఆ పాత్ర నేనెందుకు ఒప్పుకున్నానో అందరికీ అర్థమవుతుంది. 15ఏండ్ల తర్వాత నేను నటించిన సినిమాలు చూసి, నేనే గర్వపడాలి' అని చెప్పారు శ్రీనిధి.

22 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలోకి.. 'ఆరుగురు పతివ్రతలు' రీ-రిలీజ్!

దివంగత దర్శకుడు ఈ.వి.వి. సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన చిత్రం "ఆరుగురు పతివ్రతలు". అప్పట్లో వివాహ వ్యవస్థ, దాంపత్య జీవితంలోని సంక్లిష్టతలు, ఈగోలు మరియు కుటుంబ బంధాల నేపథ్యంలో సాగిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఓ సరికొత్త సంచలనం సృష్టించింది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు ఆలోచింపజేసిన ఈ చిత్రం, ఇప్పుడు సరికొత్త హంగులతో మరోసారి థియేటర్లలో అలరించేందుకు సిద్ధమవుతోంది.ఈ సినిమాను అక్టోబర్ 29న అత్యంత వైభవంగా గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రం తొలిసారిగా 2004 ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సాధించింది. సరిగ్గా ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు సరికొత్త డిజిటల్ టెక్నాలజీతో నేటి తరానికి సరికొత్త వినోదాన్ని పంచేందుకు రీ-ఎంట్రీ ఇస్తోంది.



'సిగ్మా' - మూవీ రివ్యూ!

అందుకు భిన్నంగా ఆయన మెగాఫోన్ పట్టుకున్నాడు. సందీప్ కిషన్ హీరోగా ఒక సినిమాను రూపొందించాడు .. ఆ సినిమా పేరే 'సిగ్మా'. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా, తమన్ సంగీతాన్ని సమకూర్చాడు. ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది.గురు (సందీప్ కిషన్) తల్లిదండ్రులను కోల్పోయిన ఓ అనాథ. తనని చేరదీసిన డాక్టర్ 'నీల్' (రాజు సుందరం)తో అతను ఎంతో సన్నిహితంగా ఉంటాడు. తండ్రి చేసిన అప్పులు అతనిని సతమతం చేస్తుంటాయి. అందుకు అవసరమైన డబ్బులను ఎలా సర్దుబాటు చేయాలో తెలియక తికమక పడుతుంటాడు. ఆ ఇంట్లో తల్లికి సంబంధించిన ఒక పాత లైబ్రరీ ఉంటుంది. ఆమెకి గుర్తుగా అతను ఆ లైబ్రరీని కాపాడుకుంటూ వస్తుంటాడు. ఆ



లైబ్రరీని ఉపయోగించుకుని 'ఆడియో బుక్ ఛానల్' ను ఏర్పాటు చేయాలనే ఒక ఆలోచన చేస్తాడు. ఆడియో బుక్ ఛానల్ కి లేడీ వాయిస్ అయితే బాగుంటుందనే ఉద్దేశంతో, ఆర్జేగా పనిచేస్తున్న 'సామ్' (ఫరియా అబ్దుల్లా)ను 'గురు' సంప్రదిస్తాడు. అలా వాళ్లిద్దరి మధ్య పరిచయం మొదలవుతుంది. అప్పు తీర్చకపోతే ఆ ఇంటిని సొంతం చేసుకుంటామని అప్పులవాళ్లు 'గురు'ను హెచ్చరిస్తారు. దాంతో ఎలాగైనా సాధ్యమైనంత త్వరగా పెద్ద మొత్తంలో సంపాదించాలని నిర్ణయించుకుంటాడు.

తెలుగులోకి 'హనుమాన్ అంశ్'..

ఆధ్యాత్మిక కథాంశంతో తెరకెక్కిన 'హనుమాన్ అంశ్' సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్ల మార్క్‌ను దాటిన ఈ సినిమా.. ఎట్టకేలకు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా తెలుగు వెర్షన్‌ను విడుదల చేయనున్నట్లు హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది.నిజానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18న విడుదల కావాల్సి ఉంది. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు చెందిన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తెలుగు వెర్షన్‌ను సమర్పించనున్నట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే డీల్ కుదరకపోవడంతో త్రివిక్రమ్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో తెలుగు టీజర్‌ను విడుదల చేసేందుకు ఏర్పాట్లు కూడా చేశారు. అయితే చివరి నిమిషంలో ఆ కార్యక్రమం



రద్దయింది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ స్వయంగా తెలుగు విడుదల బాధ్యతలను తీసుకుంది.కేవలం రూ.1.8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కినట్లు చెబుతున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 28 నాటికి భారత్‌లో రూ.300 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించింది. 52వ రోజుకు ఈ మార్క్‌ను అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ సినిమా.. నీమ్ కరోలి బాబా జీవిత ప్రేరణతో తెరకెక్కిన ఆధ్యాత్మిక కథ. లక్ష్మీ నారాయణ్ అనే వ్యక్తి ఆధ్యాత్మిక మార్గంలోకి వెళ్లి ప్రముఖ సాధువుగా ఎలా మారాడన్నదే కథ. నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్యా నటించారు. విహాన్ షెదెగే, పూర్ణిమ తివారీతో పాటు పలువురు కీలక పాత్రల్లో కనిపించారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.